సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 24-4-2025
సంపుటి: 21 సంచిక: 26
పేజీలు: 8 వెల: రూ.1






- డివిజన్ ఇన్‌ఛార్జీల మార్పునకు కసరత్తు
- అనంతరం నగర అధ్యక్షుడి ఎన్నికకు సన్నాహాలు
- వీటిపై టీడీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం
- ఈ ఎన్నికలు ఎమ్మెల్యే శంకర్‌కు కత్తి మీద సామే

# టీడీపీలో సంస్థాగత రాజకీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ నగర శాఖ సంస్థాగత ఎన్నికలకు సిద్ధమవుతోంది. దీనిపై చర్చించేందుకు స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో గురువారం సాయంత్రం 50 డివిజన్ల ప్రస్తుత ఇన్‌ఛార్జీలతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మిగిలిన మున్సిపాలిటీలతో పాటు శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించినా లేకపోయినా సంస్థాగతంగా అన్ని డివిజన్లకు పక్కాగా ఇన్‌ఛార్జీలను నియమించాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఈ మేరకు అందరితోనూ సమావేశమవుతున్నారు. ప్రస్తుతం గొండు శంకర్ ఎమ్మెల్యేగా ఉండగా, గతంలో 2014-19 మధ్య తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు గుండ లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ ఐదేళ్లు లక్ష్మీదేవే నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఆ సమయంలో 50 డివిజన్లకు పార్టీ ఇన్‌ఛార్జీలను నియమించారు. 2024 - మిగతా చివరి పేజీలో



CREDAI SRIKAKULAM

# అపార్ట్‌మెంట్లే భావి ఆశాసౌధాలు

శ్రీకాకుళం నగరానికి అపార్ట్‌మెంట్ సంస్కృతే బాగా ఉపయోగపడుతుంది. భూముల ధరలు బాగా పెరిగిపోయిన పరిస్థితుల్లో వ్యక్తిగత గృహాలకంటే అపార్ట్‌మెంట్ల రూపంలో ఫ్లాట్ల కొనుగోళ్లే ఆశాజనకంగా ఉంటాయి. దేశీయ రియల్ ఎస్టేట్ పరిశ్రమను ప్రగతిశీలం, వ్యవస్థీకృతం చేయడమే కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఏర్పాటు లక్ష్యం. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ సంస్థ దేశ వ్యాప్తంగా 13 వేల చాప్టర్స్(శాఖలు) కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 24 చాప్టర్స్‌లో 1300 మంది బిల్డర్లు, డెవలపర్లు సభ్యులుగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా చాప్టర్‌లో 60 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో శ్రీకాకుళం నగరానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు.

- భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో అవే శరణ్యం
- నిర్మాణరంగంపై ప్రజల్లో చైతన్యానికి కృషి
- బిల్డర్లు, డెవలపర్లు, కొనుగోలుదారుల సమస్యల పరిష్కారానికి కృషి
- సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు
- 'సత్యం' ప్రత్యేక ఇంటర్వ్యూలో క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.చక్రవర్తి

**జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో దశాబ్దం క్రితమే క్రెడాయ్ శాఖ ఏర్పాటైనా, గత రెండేళ్ల నుంచి అది క్రియాశీలంగా పనిచేస్తోంది. బిల్డర్లు, డెవలపర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్మాణరంగానికి సంబంధించి ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాల వల్ల కలిగే నష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సానుకూల మార్పులు చేయించేలా క్రెడాయ్ కీలకంగా వ్యవహరిస్తోందని, తీవ్రంగా కృషి చేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.చక్రవర్తి చెప్పారు. 'సత్యం' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్రెడాయ్ పాత్ర, అది చేస్తున్న కృషి, దాని లక్ష్యాలను వివరించారు.**

**సత్యం: నిర్మాణరంగంలో క్రెడాయ్ పాత్ర ఏమిటి?**

**చక్రవర్తి:** భూమి ధరలు పెరగడం వల్ల మధ్యతరగతి సొంతింటి కల సాకారం కావడం లేదు. తక్కువ భూమిలో సౌకర్యవంతమైన ఇళ్లు నిర్మించడానికి అపార్ట్‌మెంట్ కాన్సెప్ట్ వచ్చింది. శ్రీకాకుళం ప్రజలు మొదటి నుంచి సంప్రదాయ పద్ధతులే పాటిస్తున్నారు. అందులో భాగంగా భూమిపైనే పెట్టుబడులు పెట్టడం అనవాయితీగా వస్తోంది. ఫలితంగా భూముల ధరలు అమాంతం పెరిగి సామాన్యుల సొంతింటి కల కష్టసాధ్యమైంది. దీన్ని అధిగమించడానికి అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చింది. నాణ్యతతో కూడి, ప్రభుత్వ నిబంధనలకు లోబడి వీటి నిర్మాణాలు ఉండాలి. బిల్డర్లు, డెవలపర్లకు వీటిపై పూర్తి అవగాహన అవసరం. నిబద్ధతతో కూడిన నిర్మాణాలు చేపట్టే విషయంలో బిల్డర్లకు అవగాహన కల్పించేందుకు క్రెడాయ్ కృషి చేస్తోంది. మార్కెట్‌లోకి వచ్చే కొత్త ఆవిష్కరణలు, నిర్మాణ రంగానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాలు, నిబంధనల్లో మార్పులు చేర్పులు, వాటి ప్రభావంపై బిల్డర్లు, డెవలపర్లకు తరచూ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తుంటాం.

**సత్యం: శ్రీకాకుళంలో నిర్మాణ రంగం ఎలా ఉంది?**

**చక్రవర్తి:** పేదల ఊటీగా - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# మతం మత్తు నుంచే ఉగ్రవాదం!

అమాయక పర్యాటకులపై కాశ్మీర్లో జరిగిన ముష్కర దాడిని యావత్తు ప్రపంచంతో పాటు ఉగ్రమూకలైన తాలిబన్లు సైతం ఖండించారు. కానీ మనదేశంలో కొంతమంది మాత్రం ఈ దారుణాన్ని ఖండించకపోగా తేడాగా మాట్లాడుతున్నారు. అటువంటి వారిలో రాబర్ట్ వాద్రా ఒకరు. 'ముస్లింలు బలహీనంగా ఉన్నారు. అందుకే ఉగ్రదాడి. భారతదేశంలో మైనారిటీలు అసౌకర్యంగా, ఇబ్బందిగా భావిస్తున్నారు. బీజేపీ హిందుత్వ విధానం దీనికి కారణం' అని ఆయన వ్యాఖ్యానించడం చూస్తే.. బహుశా ఇలాంటి వాళ్లు తేడానేమో..!? అన్న భావన కలగకమానదు. నల్ల కళ్లద్దాలు పెట్టుకుని చూస్తే అంతా చల్లగానే కనపడుతుంది. కళ్లద్దాలు తీశాక కూడా అలాగే కనపడుతుందంటే మాత్రం చూపులో సమస్య ఉన్నట్లే. ఒకర్ని చంపటానికి మతం ప్రాతిపదిక కాకుండా ఉన్నట్లయితే.. ఉగ్రవాదానికి మతం లేదని నేనొప్పుకుంటాను. నేనూ సెక్యూలర్నే అంటాను. విధ్వంసం జరగటానికి కారణం మతం కాకుండా ఉన్నట్లయితే.. ఉగ్రవాదానికి మతం లేదని నేనొప్పుకుంటాను. నేనూ సెక్యూలర్నే అంటాను. ఇళ్ల లూటీకి, మనుషుల వేడి నెత్తురు ఏరులై పారటానికి, ధనమాన ప్రాణాలు విలువ లేనివైపోవటానికి మతం కారణం కాకుండా ఉండుంటే.. ఉగ్రవాదానికి మతం లేదని నేనొప్పుకుంటాను. నేనూ సెక్యూలర్నే అంటాను. ప్రాణం ఎవరికైనా తీపే.. కానీ మనవాళ్లవి తప్పు.. కాని వారి ప్రాణాలకు విలువ లేదనుకునే మూఢత్వానికి కారణం మతం కాకుంటే.. ఉగ్రవాదానికి మతం లేదని నేనొప్పుకుంటాను. నేనూ సెక్యూలర్నే అంటాను. అలా మనిషి విలువ అతని మాతాన్ని బట్టో.. అతని కులాన్ని బట్టో.. అతని ప్రాంతాన్ని, లింగాన్ని బట్టో మారదని నమ్మే సెక్యూలర్నే నేను. కానీ దాన్నే బలహీనతగా భావించి.. నాలాంటి వారిపై దాడులు జరుగుతూ ఉంటే.. ఇంకా ఉగ్రవాదానికి మతం లేదని చెప్పమంటారా? కళ్లుండీ ధృతరాష్ట్రులం కమ్మంటారా...? నేను సెక్యూలర్నే మత ప్రాతిపదికన కాకుండా.. మంచిచెడూ ప్రాతిపదికన అన్నీ జరిగినపుడు! నేను సెక్యూలర్నే.. ఈ భేద భావం చూపని వాడినే.. నన్నూ అలాగే ఎదుటివాళ్లు చూసినప్పుడు.. నాతో వ్యవహరిస్తున్నప్పుడు మాత్రమే! నేనూ సెక్యూలర్నే.. అందరూ ఒకటే అనేవాడినే.. అందరూ ఒకటే అని అందరూ అనుకున్నప్పుడు! నేనూ సెక్యూలర్నే.. మతం ఇంటి పూజగదికి పరిమితమవ్వాలని కోరుకునేవాడినే.. కానీ ఆ ఇంట్లో చొరబడి పూజ గదినే ధ్వంసం చేస్తుంటే మాత్రం ఇంకా మనసులోనే దేవుడిని పూజించుకోవాలనే పైత్యం తలకెక్కనంత వరకూ! చివరగా ఒక మాట.. ఒక మతం దైవ ప్రార్థనా పరిజనుడిని.. తన దైవ ప్రార్థన.. తన ప్రార్థనాలయంలోనే చేసుకుంటున్నప్పుడు.. అదే కారణంతో చంపేస్తే.. దాన్ని కేవలం ఒక మర్డర్ కేసు అని తేల్చిపారేసి.. మనమంతా ఒక్కటే అని కళ్లు మూసుకు కూర్చుంటున్నావంటే.. మరో మతానికి చెందిన దైవ ప్రార్థనా పరిజనుడి మరణం ఒక యాక్సిడెంట్ అని నిర్ధారణ చేశాక కూడా అది ఒక హత్య అని మత ప్రాతిపదికనే అది జరిగిందని, దానికి మతోన్మాదం కారణమని ఇంకా గోల చేస్తూంటే.. నిజమే కాబోలు అనుకుంటున్నావంటే.. అన్నీ మతాలు సమానమే అనుకుంటున్నావంటే.. ఇంకా పూజారి, పాస్టర్ ఒకటే అని నన్నూ అనుకోమంటున్నావంటే.. మిత్రమా నిజం చెప్పు.. నిన్ను నువ్వు మేధావిని అని అనిపించుకోవాలనే ఆశతో నీ తలను ఇసుక బొరియల్లో దాచుకున్నావు కదూ.. నేను నిజంగానే సెక్యూలర్ని.. అవతలివాడు అదే అయినప్పుడు.. నాకు అందరూ సమానమే నన్నూ ఎవ్వరూ తక్కువగా చూడనంతవరకు.. నేను అందరినీ గౌరవిస్తాను నాకూ అలాంటి గౌరవమే అక్కడ అందుతున్నంతవరకు.. నాకు ఏ పట్టింపులూ లేవు.. పట్టింపులతో ఇతరులు నన్నూ పక్కన పెట్టనంత వరకు!!! అంతే తప్ప.. అవతలివారు అన్ని పట్టింపులు పాటిస్తూ విద్వేషాలు రెచ్చగొడుతూ మతం పేరిట మారణకాండ సృష్టిస్తున్నా కూడా ఇంకా సెక్యూలరిజమ్ పేరుతో మడికట్టుకుని కూర్చోమంటన్నట్లుంది రాబర్ట్ వాద్రా వంటి వారి తీరు. ఉగ్రవాదుల దుశ్చర్యను మనం ఇక్కడ మతాలవారీగా వర్గీకరించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకుంటున్నాం. కానీ మారణకాండ జరిగిన ప్రదేశంలో మాత్రం ఆ దారుణాన్ని చూసి మనం ద్వేషించే ముస్లిములు కూడా రోదిస్తున్నారు, మసీదుల్లో ప్రార్థిస్తున్నారు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేస్తున్నారు, సంతాపసభలు పెడుతున్నారు. సమూహాలుగా రోడ్ల మీదకొచ్చి దుండగుల దుశ్చర్యను నిరసిస్తున్నారు. మనిషి తనాన్ని బతికిస్తున్నారు.

## "రమణమూర్తి"కి ఘనంగా పదవీవిరమణ వీడ్కోలు

(సత్యంన్యూస్, గార)

మండలంలోని సతివాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రఘుపాత్రుని వెంకటరమణమూర్తి ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.గౌరీశంకం మాట్లాడుతూ రమణమూర్తి నిబద్ధతగల ఉపాధ్యాయుడనీ, ఎందరో విద్యార్థులను ఉన్నతస్థితిలో నిలిపారన్నారు. కార్యక్రమంలో నారాయణరావు, పెదలాపు శ్రీరాములు, కొయ్యాన నాగభూషణరావు, పి.సుధా కర్, డి.వి.యస్.ప్రసాద్, బి.జనార్ధనరావు, కె.శ్రీనివాస రావు, కె.నీలయ్య, సీహెచ్.లక్ష్మీరాజ్యం, ఆర్.తులసిదాస్, పి.రాములమ్మ, సి.ఆర్.యం.టి, గోరు అప్పన్న, పి.సత్యన్నారాయణ, టి.రమామణి, ముద్దాడ రామకృష్ణ, తాళ్ళ నాగేశ్వరరావు, పి.సుందరరావు, సిహెచ్ ముకుందరావు, రమణ మూర్తి కుటుంబసభ్యులు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు






పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గాల సమన్వయకర్తలు రెడ్డి శాంతి, పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ ముఖ్యనాయకులు మెంటాడ స్వరూప్, మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, సీపాన వెంకటరావు, గేదెల పురుషోత్తం, రౌతు శంకరరావు, ముంజేతి కృష్ణ, పొన్నాడ రిషి, వాన గోపి, ఎంపీపీలు అంబటి శ్రీను, టీ.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# పాకిస్థాన్‌ది పిరికిపంద చర్య



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు పిరికిపందచర్యగా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈదాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పర్యాటకులు అమాయకంగా ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని కేంద్ర, రాష్ట్ర మంత్రులు వ్యాఖ్యానించారు. ఈ దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సూర్య మహల్ జంక్షన్ నుంచి డే అండ్ నైట్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శాసనసభ్యులు గొండు శంకర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ హోంమంత్రి అమిత్ షా సూచనలతో 35 విమానాలను ఏర్పాటు చేసి 4500 మందిని వారి స్వస్థలాలకు చేర్చామన్నారు. మృతదేహాలను కూడా కుటుంబాలకు చేరుస్తున్నామని, చంద్రమౌళి మృతదేహం విశాఖపట్నం చేరుకుందన్నారు. సీఎం చంద్రబాబు విమానాశ్రయానికి వెళ్లి నివాళులర్పించారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్లైన్స్ ఛార్జీలు ఎక్కడా పెంచకూడదని ఆదేశించామన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామన్నారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేసిన అంశాన్ని కేంద్ర మంత్రి ప్రస్తావించారు "ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఎక్కడ ఉన్నా వదిలే ప్రసక్తే లేదు. దేశం మొత్తం బాధిత కుటుంబాల వెంట ఉంది. న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ "మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీపంలో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపంద చర్య అన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఈ దాడిలో శ్రీకాకుళం నగరానికి చెందిన చంద్రమౌళి చనిపోవడం బాధాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఈర్యాలీలో పలు స్వచ్ఛంద సంస్థలు, కూటమి నేతలు, భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## 26న రంగస్థలం నాటకాల ప్రదర్శన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ హార్మోనియం వాయిద్య కళాకారులు, కళాపోషకులు, రిటైర్డ్ ఇంజనీర్ బీవి మోహనరావు 76వ జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, సన్నిహితుల సహకారంతో ఈనెల 26న పౌరాణిక నాటకాల్లో కొన్ని ప్రధాన ఘట్టాలను ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక కరపత్రాన్ని విడుదల చేశారు. 26న సాయంత్రం 7 గంటల నుండి స్థానిక బాపూజీ కళామందిర్ వేదికగా ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయన్నారు. అనంతరం రాత్రి 8గంటలకు కురుక్షేత్రంలో దుర్యోధన మయసభ– సంది శీను, రాత్రి 10:30నుండి రామాంజనేయ యుద్ధంలో శీను, రాత్రి 12 గంటలకు గయోపాఖ్యానంలో యుద్ధశీను రాత్రి 1.30 నిమిషాలకు సత్యహరిచంద్రలో వారణాసి నుండి కొన్ని ఘట్టాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ నాటకాల్లో రాష్ట్రంలో పేరుగాంచిన పలువురు కళాకారుల గొప్ప ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. మహాలక్ష్మి ఆధ్యాత్మిక సామాజిక సేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ధర్మపురి గౌరీశంకరశాస్త్రి పర్యవేక్షణలో జరగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రముఖ పౌరాణిక నటులు ఎడ్ల గోపాలరావు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ ఏపీ వైస్‌చైర్మన్ పి. జగన్మోహనరావు, ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ , జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జీవీ రమణ, ప్రముఖ స్వచ్ఛంద సేవకులు సూర శ్రీనివాసరావు హాజరుకానున్నారని తెలిపారు



వైకాపా రాజకీయ సలహా కమిటీ సభ్యునిగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

అడుగు
మోపే స్థలమిచ్చేసరికి అలా పెరిగిపోయాడు వామనుడు, నాగేశ్వరరావుకు అడుగు మోపే అవకాశం ఎవరిస్తే ఏం? ఎలా పెరిగాడు,ఏం సాధించాడు అనేదే కథానాయకుడి కథ. ఎలా పెరిగాడు? జీరో లాంటి వేషంతో ప్రవేశించి,హీరో దాకా పెరిగాడు. ఏం సాధించాడు? లక్షలు(వివరాలు ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళకూ, ఆయనకూ తెలుసూ) సంపాదించాడు. మద్రాసులో ఒక ఇల్లు కొన్నాడు. అమ్మాడు. మరొక ఇల్లు కట్టాడు... అమ్మాడు. హైదరాబాద్ లో ఒక ఇల్లు కొన్నాడు. ఇంకొక ఇల్లు కడుతున్నాడు. పాడి చేస్తాం, దంచేస్తాం అనే ఒక పరిశ్రమ, మరి కొన్ని పరిశ్రమలూ పెట్టాడు. పిల్లల భవిష్యత్తుకు కావల్సిన ఏర్పాట్లన్ని చేసాడు. మంచి కార్లున్నాయి కాబట్టి తిరుగుతాడేమో అనుకుంటే మంచి సంసారం ఉండబట్టే తిరగటం లేదు. తానట్టే చదువు కోలేదు కనుక ఇతరులైనా చుదువుకోనీ అని గుడివాడలో తన పేరిట ఒక కాలేజీ పెడతామంటే సరేనని విరాళమిచ్చాడు. త్వరలోనే ఇలాంటివి మరి కొన్ని చేస్తాడంటున్నారు.. చేస్తాడు. ఇదయ్యా కథ.. "ఇదంతా మాకు తెలిసిందే కదయ్యా" అంటారు. అవును... మీకు తెలియనిది చెప్పమంటారా? చెప్తాను.



# నాగేశ్వరరావు అందగాడు కాదు!

## అక్కినేని గురించి ఆత్రేయ వ్యాసం...

నాగేశ్వరరావు అందగాడు కాదు. దేశంలో కొందరమ్మాయిలు నా మీద విరుచుకు పడ్డా సరే..అన్నపూర్ణమ్మగారు నన్ను క్షమిస్తారు కనుక అందగాడు కాడు. నాగేశ్వరరావుకు మంచి కళ్ళు లేవు. కంఠం అంత కన్నా లేదు. ఒడ్డూ పొడుగూ విగ్రహం లేదు బాషా పాండిత్యం లేదు. ఇంతెందుకు నటుడికి కావిలిసిన లక్షణాలు అసలు లేవు అయినా–హీరో అయ్యాడు. ఇప్పటికీ హీరోగా ఉన్నాడు.. ఇంకా ఉంటాడు...ఇదయ్యా కథ.." ఇదీ మాకు తెలిసిందే కదయ్యా?" అంటారు.

మీకేమిటి నాగేశ్వరరావుకే తెలుసు. కనుక మీకూ..ఆయనకూ తెలియందొకటి చెప్తాను. నెల్లూరులో 'మాయాలోకం' విడుదలైంది చూశాను. అందులో ఆ కుర్రాడి పేరు నాగేశ్వరరావు అని నాకు తెలియదు కానీ ఈ కుర్రాడెవరో ఫరవాలేదు–కంఠమూ, బిగుసుకుపోవటమూ–ఈ రెండూ సర్దుకుంటే పనికొస్తాడు, అని నేననుకున్నాను. పక్క నెవరితోనో అన్నాను కూడా ఇప్పుడు పెద్ద వాళ్ళయిన వాళ్ళందర్ని గురించి ఒకప్పుడిలా అనుకున్నామని చాలా మంది చెప్పడం సహజం. నేను ఆ జాబితాలో చేరను. ఎందుచేతంటే నేనప్పుడు నాటకాలలో ఉన్నాను.

ప్రతిభను వెతకటం,గుర్తించటం నా వృత్తిగా ఉండేది. పైన నేను ఉదహరించిన రెండులోపాలూ ఆయన ఏ మాత్రం సర్దుకున్నాడో మీరే నిర్ణయించాలి. కానీ,నేననుకున్నట్లు మాత్రం పనికొచ్చాడు. పై కొచ్చాడు.

"ఎలా పైకొచ్చాడయ్యా?" అంటారు. నాగేశ్వరరావు ఇంత పైకి రావటానికి ఒక కుల వ్యవస్థ,ఒక నిర్మాణ సంస్థ,ఒక పంపణీ కంపెనీ వెనక ఉన్నాయని కొందరంటూంటారు. తన లోపాలు తనకు తెలుసు కనుక. తన తప్పులు తను తెలుసుకుంటాడు కనుక. నాగేశ్వరరావంటే అదృష్టం కాదు. అంగబలం కాదు,అర్ధబలం కాదు. నాగేశ్వరరావు అంటే దీక్ష,కృషి,క్రమ శిక్షణ. నాగేశ్వరరావు నటుడుగా పుట్టలేదు. నటుడు కావాలనుకున్నాడు. శరీరాన్ని, మనసునూ, అలవాట్లనూ, అభిరుచులను, ఆశలనూ, ఆకర్షణలనూ, అదుపులో పెట్టుకుని, తన లక్ష్యానికి తగ్గట్టుగా మలుచుకుని తీర్చి దిద్దుకుని నటుడయ్యాడు. దీనికంతా ఆనాటి సినిమా పరిశ్రమ వాతావరణం కూడా సహాయపడింది. అంటే–తారాబల ప్రభావం ఇంత ప్రబలంగా లేని రోజులవి. దర్శకుడు, కెమెరామెన్,సౌండ్ రికార్డిస్ట్ మొదలగు సాంకేతికనిపుణులే అప్పుడు తారలు. వాళ్ళలో చాలా మంది విద్య,సంస్కారం కలవారు. దక్షిణ దేశ చలన చిత్ర పరిశ్రమ ఒక లక్ష్యంగా,ఒక ఉద్యమంగా స్వీకరించినవాళ్ళు. అందువల్ల ప్రతిభను వెతకడం,తయారుచేయడం పరిశ్రమకు బలం చేకూర్చడం వాళ్ళ కర్తవ్యంగా ఉండేది. ఈ వాతావరణం అప్పుడుండబట్టే ఆ నాగేశ్వరరావు ఈ నాగేశ్వరరావు అయ్యాడు. అవన్నీ ఇప్పుడు పూర్తిగా శూన్యం కాబట్టే మరో నాగేశ్వరరావు రాలేకపోతున్నాడు. నాగేశ్వరరావు ఇంకా హీరోగా చెలామణి కావడం మనకు ఇబ్బంది లేదు కాని,మరి కొందరు నాగేశ్వరరావులు రాకపోవడం పరిశ్రమకు ఆరోగ్యకరం కాదు. నాగేశ్వరరావు గొప్ప నటుడంటారు. కాదని నేనంటాను. కారణం నాగేశ్వరరావును నటజీవితానికి పరిచయం చేసిన నాటక రంగాన్ని ఆయన వదలకుండా ఉంటే ఆయన నటన నిగ్గు తేలేది. అందుకు నిదర్శనం చాలా మంది తమిళ నటులే. నాగేశ్వరరావు ఇప్పటికి ఆరితేరింది సినిమా నటనలో మాత్రమే అని నా అభిప్రాయం. నటన గురించి ఆయనకు కొన్ని నిశ్చతాభిప్రాయాలు ఉన్నాయి. వాటితో నేనేకీభవించను. అందువల్ల నాగేశ్వరరావుకు నష్టముండదు..కాని ఆయన మళ్ళా నాటకరంగానికి రావడం అంటూ తటస్థపడితే నటన గురించి ఆయన నిశ్చితాభిప్రాయాలు మార్చుకుని నాతో ఏకీభవిస్తాడనీ, అందువల్ల చాలా లాభం ఉంటుందని నా ఆశ. ఈ సోదంతా ఎందుకంటారేమో...అభిమానముంది కనుక. నన్ను గురించి నాగేశ్వరరావును అడగండి ..ఎన్ని చెబుతాడో..అదీ అభిమానమే. మీకు తెలియంది ఇంకోటి చెబుతాను. నేనింతవరకూ మానవ మాత్రుడు మీద.. అందులో సినిమా నటుడు మీద వ్రాయటం ఇదే మొదటిసారి. అందుకే పొగడాలంటే పొగరడ్డమొస్తోంది. తెగడాలంటే సత్యం అడ్డొస్తోంది. అందుచేతే నాగేశ్వరరావు కృషిని ఎప్పుడూ కాదనను గొంగళి పురుగు సీతాకోక చిలుక కావడానికి పడే శ్రమ,పరిణామ అవస్థలూ పడ్డాడు నాగేశ్వరరావు. అందుకే నిలబడ్డాడు. అందుకే ఇప్పుడు వచ్చిన,ఇక రాబోయే నటులకూ,హీరోలకు ఆదర్శంగా ఉంటాడు. నాగేశ్వరరావు అందుకున్న శిఖరాలను చూసి అర్రులు చాచే వాళ్ళే కాని,చేసిన కృషినీ,పడ్డ శ్రమనూ బయిలుదేరే ముందు చేరుకోవాలనుకున్న లక్ష్యాన్నీ గుర్తించి అనుసరించేవాళ్లు ఒక్కరూ లేరు. నాగేశ్వరరావు సినిమా పరిశ్రమకు డబ్బు సంపాదించాలని రాలేదు. ఇప్పటికీ ఆయన డబ్బుని సంపాదిస్తున్నా – డబ్బు ఆయన్ను సంపాదించడం లేదు. వ్యక్తిగా ఆయనకు జీవితంలో సంతృప్తి ఏర్పడింది. నటుడుగా ఆయనకింకా అసంతృప్తి ఉందని నాకు తెలుసు.అసంతృప్తిని వెతుకుతూనే ఇంకా వేషాలు వేస్తున్నాడు. అది దొరికే వరకూ హీరోగానే ఉంటాడు. దొరికిన నాడు నిజంగా హీరో అవుతాడు. నాగేశ్వరరావు మంచివాడంటారు. అంత మంచివాడేం కాదు. కాస్త చెడ్డవాడు కూడా అంటాను. సినిమా పరిశ్రమలో అందరూ అనుసరించలేని నీతులూ, నియమాలు కొన్ని ఉన్నాయి ఆయనకు. అవి అందరూ అనుసరించాలని ఆయన పట్టుదల అనుసరించలేని వాళ్ళకు చెడ్డవాడవుతుంటాడు. నా పేరు నాగేశ్వరరావు. నేను నాగు పాములాంటి వాడ్ని అని ఒకప్పుడన్నాడట. నిజమే. ఆయన పగ పడతాడు. కానీ విషం కక్కడు. నాగేశ్వరరావు నిలకడ లేని మనిషి. అభిప్రాయాలు మార్చుకుంటూంటాడు. అవును... ఆ మార్చుకునేవి దురభిప్రాయాలే. నాగేశ్వరరావు ఇంత పైకి రావటానికి ఒక కుల వ్యవస్థ,ఒక నిర్మాణ సంస్థ,ఒక పంపెణీ కంపెనీ వెనక ఉన్నాయని కొందరంటూంటారు. నేనది సుతారామూ నమ్మను.ఒప్పుకోను. ఆ నమ్మకంతో అలాంటి ఏర్పాట్లు చేసుకోవటానికి ఈ తరం వాళ్ళు ఎవరైనా ప్రయత్నిస్తే తప్పు దారిలో వెళుతున్నారని..అభివృద్ధి కన్నా అధోగతి పాలవుతారనీ హెచ్చరిస్తున్నాను. నాగేశ్వరరావు సినిమా రంగంలో అడుగు పెట్టినప్పుడు అలాంటివేమీ లేవు.

నిజం చెప్పాల్సి వస్తే ఆయన్ను ఆధారం చేసుకుని అవన్నీ బలం చేకూర్చుకున్నాయని అంటే తప్పులేదేమో. ఆయనకు సినిమారంగంలో మొదటి రంగు పూసింది కులం కాదు. ఆయన్ను ప్రప్రథమంగా క్లిష్టమైన ఉదాత్తమైన పాత్రలను పోషించగల నటుడుగా నిరూపించింది తన నిర్మాణ సంస్థ కాదు. నాగేశ్వరరావు తన్ను తానొక బంకమట్టిగా భావించుకున్నాడు. దాన్ని తానే మర్ధించాడు. మదించాడు. అందులో రాళ్ళూ రప్పలూ,నలుసులూ పొలుసులూ ఏరి పారేసుకున్నాడు. తనకొక రూపాన్ని నిర్ణయించుకొని,తీర్చి దిద్దుకున్నాడు. ఒకమూర్తిగా తయారయ్యాడు. మనం దాన్ని ఆదర్శమూర్తి అందాము. కృషీవలుడుగా పుట్టి కృషిలో ఉన్న ఖుషీని గుర్తించి,నిషాను ఆస్వాదించిన ఒక మధురమూర్తిగా తయారయ్యాడు.

**నాగేశ్వరావు ఈజ్ యీక్వల్ టు కృషి –ఈజ్ యీక్వల్ టు నాస్తి దుర్భిక్షం. (షరా ఈ వ్యాసం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చిన బిరుదు వాడలేదు–వాడకూడదన్నారు కనుక.)**

**'డు' అన్నాను–నాకు చాలా అప్పు'డు' కనుక.**

# ఉగ్రవాదుల చర్యకు ప్రతి చర్య తీసుకుంటాం

సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులు పిరికి పంద చర్యగా దేశావ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ దాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం హృదయ విధారకమని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు వ్యాఖ్యనించారు. ఈ దాడిని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాలలో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో ఇప్పటికే 35 విమానాలను ఏర్పాటు చేసి 4500 మందిని ఇప్పటికే వారి స్వస్థలాలకు తరలించారన్నారు. మృతదేహాలను కూడా కుటుంబాలకు చేరుస్తున్నారన్నారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఎక్కడ వున్నా వదిలే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. దేశం మొత్తం బాధిత కుటుంబాల వెంట ఉంది అని న్యాయం జరిగేలా మా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

నిత్యఅన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా 450వ రోజున ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో గల విద్యానగర్‌కు బొడ్డేపల్లి జానకిరామ బారసాల సందర్భంగా తల్లితండ్రులు బొడ్డేపల్లి అశోక్, కమలహర్ష శ్రీ దంపతులు, అక్క మోక్షశ్రీలు 35మందికి అన్న సమర్పణ, మజ్జిగ బాటిల్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడంలోనే ఎంతో తృప్తి ఉంటుందన్నారు.

– సత్యంన్యూస్, ఆమదావలవలస



# శాలిహుండం సర్పంచ్‌కు సత్కారం

(సత్యంన్యూస్, గార)

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొండు శంకర్, జెడ్పి సీఈవో ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా సత్కరించారు. గ్రామీణాభివృదిద్ధి, మౌళికసదుపాయాల కల్పనకు చేస్తున్న కృషిలో భాగంగా జిల్లా యంత్రాంగం గుర్తించి ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసింది. రెండు పర్యాయాలుగా సర్పంచ్‌గా, గతంలో రెండుసార్లు ఎంపీటీసీగా ఆదినారాయణ సేవలందిస్తూ వస్తున్నారు. తనను సత్కరించిన జెడ్పి చైర్పర్సన్, ఎమ్మెల్యే, సీఈవోలకు ఆదినారాయణ ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం వెంటనే అమలు చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎమ్.ఆది నారాయణమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి హరినారాయణ, యం.హరనాధరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి సంక్షేమ పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్ క్లయిములు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్న నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఉప కార్మిక కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికలలో టిడిపి కూటమి హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమత్రి పవన్ కళ్యాణ్ అమలుచేయడానికి పూనుకోకపోవడం అన్యాయమన్నారు. కార్మిక వర్గాన్ని నమ్మించి మోసగించటం పాలకులకు పరిపాటిగా మారిందని అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించి, గతంలో శాంక్షన్ చేసిన పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసే సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు చెయ్యాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహనిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణం ఇప్పించాలని, ఇతర రాష్ట్రాల్లో అమలుచేస్తున్న విధంగా భవన నిర్మాణాల కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలు అమలుచెయ్యాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ అందించాలని, కార్మికుల పని కోసం వేచి ఉండే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత వైసిపి ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా తీసుకొచ్చిన మెమో 1214ను నేటికి రద్దుచేయలేదని అన్నారు. బిల్డింగ్ సంక్షేమబోర్డును పునర్దరించి గత ఐదు సంవత్సరాలుగా జిల్లాల్లో లేబర్ కార్యాలయాలలో మంజూరు చేసి నగదు రాకుండా ఆపేసిన క్లయిమ్స్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతి నిర్మాణ కార్మికుడికి ఇల్లు కట్టుకోవడానికి బ్యాంకు లోన్ ఇవ్వాలని, నిర్మాణ రంగంలో కీలకంగా వాడే ముడి సరుకుల ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తదితర డిమాండ్లతో భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మంత్రులకి, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా కార్మికుల గురించి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులు మృతికి తెలంగాణాలో 6లక్షలు,కర్నాటకలో 10లక్షలు అమలు చేస్తున్నారని అన్నారు. కేరళలో వెల్ఫేర్ బోర్డు నుంచి పెన్షన్ కోసం 350 కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో భవన నిర్మాణ సంక్షేమ నిధి రూ.4300కోట్లు ఉన్నాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చెప్పారని అయినా ఒక్క రూపాయి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయడం లేదని అన్నారు. అన్ని కార్మిక సంక్షేమ బోర్డులు రద్దు చేయాలని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్ణయం చేసిందని ఈ నిర్ణయంను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదే విధానం అమలు చేస్తుందని అన్నారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గంజి భీమారావు, కరగాన భాస్కరరావు, అనుపోజు కామేశ్వరరావు, పనస రమేష్, పడిమి శ్రీను, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ముస్లిం జేఏసీ నేతలు, వివిధ పౌర సంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్స్ సవరణ చట్టానికి వ్యతిరేకిస్తూ జాతీయ జెండాతో నగరంలోని డైమాండ్ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ముస్లింల మేలు కోసమే వక్స్ సవరణ చట్టమని చెబుతున్న ఎన్డీఏ ప్రభుత్వం వారి అణిచివేతకు కారణమవుతోందని, ఈ చట్టాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా వర్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు ప్రవేశం కల్పించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. వక్స్ చట్టం ద్వారా ముస్లింలను ప్రధానమంత్రి అణిచివేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ చట్టం ఇస్లామిక్ చట్టం హెరి ప్రకారం ఆస్తులు, సంస్థల స్వయంప్రతిపత్తి, పవిత్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుందన్నారు. సవరణ వక్ఫ్‌బోర్డులు, వారి నిర్ణయాలపై అధికారులు నియంత్రణ ఏమిటని వారు ప్రశ్నించారు. ముస్లిం సమాజం ధర్మాలు, మతపరమైన స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే విధంగా సవరణ చట్టం ఉందన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముస్లిం భూముల స్వాధీనం చేసుకొనేందుకు పాలకులు చేస్తున్న ఎత్తుగడగా వారు అభివర్ణించారు. వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చడం తమ మతానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయడమేనన్నారు. ముస్లిం మనోభావాలు దెబ్బతీయకుండా ప్రభుత్వం చూడాలని, వక్ఫ్‌ఆస్తులు పరిరక్షించాలని, స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తే దేశవ్యాప్తంగా ఉద్యమించేందుకు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడతామన్నారు. ముస్లిం సోదరులు చేస్తున్న ఆందోళనకు సీపీఎం రాష్ట్ర నాయకులు బవిరి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీనియర్ వామపక్ష నేత తాండ్ర ప్రకాష్, జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఏఐటియుసి జిల్లా నేత డి.గణేష్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్, కెవిపిఎస్ రాష్ట్ర నేత మిస్క కృష్ణయ్య, రాకోటి రాంబాబు, గంజి ఆర్ ఎజ్రా, ముస్లిం ఎ జేఏసీ కన్వీనర్ షేక్ సలీం అమీర్, ముజీబ్, ఎం.ఏ. రఫీ, మహిబుల్లాఖాన్, బహదూర్బాషా, షేక్ నిజాముద్దీన్, రఫీ అదెని, షాన్, షైలానీ, జిలానీ, సుక్రుఖాన్, వివిధ మసీదుల అధ్యక్షులు, మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, జిల్లా నలుమూలల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వక్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకి ముస్లిం జేఏసీ నేతలు వినతిపత్రం సమర్పించారు.




# ఉత్తమ ఎంపీడీవోగా రమేష్ నాయుడు

(సత్యంన్యూస్, మందస)

మందస మండల ఇన్చార్జి ఎంపీడీవోగా, వజ్రపుకొత్తూరు రెగ్యులర్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎన్.రమేష్‌నాయుడుకు ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు లభించింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరం లో గురువారం ఎమ్మెల్యే గొండు శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి రాజా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గ్రామీణ కుటుంబాల జీవితాలను మెరుగు పరచడం లో ఆయన చేసిన కృషికి గుర్తింపు, అదేవిదంగా రెండు మండలాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడం లోను ఎంపీడీఓగా రమేష్ నాయుడు పనితీరు బాగుండడంతో ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిస్తూ ఉత్తమ ఎంపీడీవో అవార్డుకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈయన పలాస డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ (ఇన్చార్జి)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయనకు ఉత్తమ ఎంపీడీవోగా ప్రభుత్వం గుర్తిస్తూ అవార్డు ఇవ్వడం పట్ల మందస మండల పరిషత్ పరిపాలనాధికారి బి.రుషేశ్వరరావు, ఈఓఆర్ధి జయప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, మరియు సచివాలయ ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవ పర్వదినము పురస్కరించుకుని శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురము ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి పలాసలో గల ఇన్‌పేషెంట్స్‌కు, పండ్లు, ఆహారము, స్వామివారి పటము, విభూదిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాళాసు శ్రీను, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, ఉపాధ్యాయులు దాలేటి, మురళి, శ్రీనివాస్, రవిశంకర్, సాంబమూర్తి, చిన్నారావు, వివేకానంద, ఋషీకేష్, అశోక్, హేమంత్, హేమ పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, పలాస



# ప్రగతి పాలనకు పంచాయతీలే మూలం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాలనా ప్రగతికి పంచాయతీలే మూలస్తంభాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటిష్టమైన పరిపాలనా విధానం, స్థానిక ప్రభుత్వాల్లో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. నిరంతరం పౌర సేవలందించే ప్రజా ప్రతినిధులకు అధికారులు, ఉద్యోగులకు ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు, గౌరవం ఉంటాయన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పన కోసం జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. జెడ్పి చైర్ పర్సన్ బాధ్యతలు నిర్వర్తించడంతో ఎన్నెన్నో కార్య క్రమాలు చేపట్టే అవకాశం లభించిందని ఆమె అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక సంస్థల ప్రతినిధులు, స్థానిక సంస్థల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులను సత్కరించడం ఆ వ్యవస్థకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ తాను తొలుత ఎంపిటిసిగా, సర్పంచ్గా జనం నుంచి ఎన్నిక కావడం ద్వారా జనానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పౌరుల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ ఎమ్మెల్యేస్థాయికి చేరుకున్నానన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ ఉద్యమాన్ని నడిపిస్తూ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంలో సర్పంచ్ల సంఘం కృషి ప్రశంసనీయమైనదన్నారు. అనంతరం జిల్లాలోని పలువురు గ్రామ పంచాయతీ సర్పంచ్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులను జెడ్పి చైర్పర్సన్ పిరియా సాయిరాజ్, ఎమ్మెల్యే గొండు శంకర్ సత్కరించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. శాలిహుండాం పంచాయతీ సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, కార్యదర్శి పల్లంటి సురేష్ రూపొందించిన లోగోను జెడ్పి చైర్పర్సన్, ఎమ్మెల్యే, జెడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్రాజా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు సురవరపు నాగేశ్వరరావుతో పాటు పలువురు సర్పంచ్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు, జెడ్పి సిబ్బంది పాల్గొన్నారు.




## పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలపడాలి

(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)

మండలంలోని చింతలబడవంజ గ్రామపంచాయతీలో స్థానిక ఉప సర్పంచ్ గేదెల లక్ష్మినారాయణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి మణికుమార్ నిర్వహణలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీసెస్ పెద్ద కోట వెంకట్రావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు అధికార వికేంద్రీకరణ కోసం 73 ,74 రాజ్యాంగ సవరణ ఆధారంగా పంచాయతీరాజ్ వ్యవస్థని పునర్మించారని ప్రజాస్వామ్యం గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ప్రజల్లో గ్రామస్థాయి పరిపాలన సుభిక్షంగా అందించాలని సదుద్దేశంతో ఈ వ్యవస్థను రూపొందించారని గ్రామాన్ని బాధ్యతగా ప్రతి ఒక్కరు స్వచ్ఛతగా సుస్థిరమైనటువంటి వ్యవస్థని ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని తెలియజేశారు గ్రామ సభలను ఏర్పాటు చేసి గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాలు గూర్చి చర్చించి అవసరాన్ని బట్టి సర్పంచ్ ఆధ్వర్యంలో ఆ కార్యక్రమాలు నిర్వహించే విధంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో రూపొందించారన్నారు. అందుకు గ్రామస్థాయిఅధికారులు ప్రజల్లో చైతన్యం నింపి సమన్వయంతో మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి పునాది వేయాలని నేటి ప్రభుత్వాలు అహర్నిస్టుల కృషి చేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గారు మణికుమారి మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ పాత్ర చాలా గొప్పదని స్థానిక గ్రీన్ అంబాసిడర్ చంద్రావును అభినందించారు కార్యక్రమంలో గేదెల వాసుదేవరావు, పార్సిల్ గజపతిరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వి.ధనలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ యావై జనార్ధనరావు, స్థానిక, డొంకలబడవంజ, చింతలబడవంజ ప్రజలు పాల్గొన్నారు.



























# ఉగ్రవాదం పిరికిపంద చర్య

## శర్వాణి విద్యాలయ ఆధ్వర్యంలో మానవహారం



**సత్యంన్యూస్, శ్రీకాకుళం**

పాకిస్థాన్ ఉగ్రవాదులు ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో సృష్టించిన నరమేధం పిరికిపంద చర్య అని శర్వాణీ విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు పేర్కొన్నారు. ఈ సంఘటనలో అశువులు బాసిన భారతీయ కుటుంబాలకు సంతాపం, సంఘీభావాన్ని తెలుపుతూ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీనుద్దేశించి సూరిబాబు మాట్లాడుతూ ఇటు వంటి దుశ్చర్యలను ఖండించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుడిపై ఉందన్నారు. బాధితులకు అండగా ఏకతాటిపై నిలబడి దేశ సమగ్రతను చాటి చెప్పాలన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రజల్లో స్ఫూర్తి నింపేందుకే ఈ మానవహారం చేదుతున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్ డా కె.రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కావాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిస్థాయి పారిశుధ్యం ప్రజలకు మార్గదర్శకంగా పంచాయతీలు పని చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది సర్పంచులకు, ఉద్యోగులకు సత్కరించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని శాలిహుండం సర్పంచ్ కాంక్యాన ఆదినారాయణను ఈ సందర్భంగా సత్కరిస్తూ మరింత బాధ్యతగా ప్రజలకు సేవలందించాలన్నారు. పంచాయతీ వ్యవస్థలో ప్రధానంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా ఉద్యోగులు ప్రజలతో మమేకం అవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తటస్థుడిగా పనిచేస్తా: దువ్వాడ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తనను సస్పెండ్ చేసినా, తనను నమ్మిన కార్యకర్తల కోసం, నియోజకవర్గం కోసం తటస్థుడిగా పని చేస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనను గుర్తించి ఎమ్మెల్సీగా పదవిని ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సస్పెన్షన్ అంటే తాత్కాలిక విరామమేనని, ఈ సమయంలో తటస్థుడిగా నియోజకవర్గ ప్రజల సమస్యలపై పోరాడతానని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడినా, నియోజకవర్గ ప్రజల కోసం పనిచేసినా ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, కేవలం వ్యక్తిగత కారణాల రీత్యా తనను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారని దువ్వాడ అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దగ్గర్నుంచి జగన్మోహన్‌రెడ్డి వరకు వారి కుటుంబంతో కలిసి అడుగులు వేశానని, ఇప్పటికీ తనను ఆదరించే కుటుంబాలు, గ్రామాలు నియోజకవర్గంలో ఉన్నాయని, వారి కోసం పని చేస్తానని ఆ సందేశంలో తెలిపారు.

# 12 మందికి 'శ్రీశ్రీ వేదిక' పురస్కారాలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సాహిత్య, కళారంగాల్లో పలు రికార్డులు సాధించిన శ్రీశ్రీ కళా వేదిక సంస్థ మే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో 'ప్రపంచ తెలుగు సంబరాలు' నిర్వహిస్తోంది. ఈ రెండు రోజుల సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా భాష ప్రతిభా పురస్కారాల ప్రదానం, సాహిత్య సదస్సులు, పత్ర సమర్పణలు, రంగస్థల ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు ఉంటాయి. అలాగే మాతృదేవోభవ పేరిట అవార్డులిస్తామని సంస్థ అధినేత కత్తిమండ ప్రతాప్‌కుమార్, జాతీయస్థాయి నాయకులు కొల్లి రమావతి, జి.ఈశ్వరి, టి.పార్థసారధి తెలిపారు. అవార్డు విజేతలుగా ఉత్తరాంధ్రలోని ఆరు (శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి) జిల్లాల నుంచి 12 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహక సంస్థ సమన్వయకర్త ఈ-వేమన ప్రకటించారు.

**పురస్కార గ్రహీతల వివరాలు:** జంధ్యాల శరత్ బాబు (తెలుగు భాష), కుమారనాయక్, ఎం.శ్రీరాములు (తెలుగుకీర్తి), రఘుపాత్రుని శివ, పి.ముకుందరావు (యువకీర్తి), గౌరీపతిశాస్త్రి (అక్షర తేజం), జె.బి.తిరుమలాచార్యులు (కళాకిరీటి), మహ్మద్ రఫీ (కవిరత్న), మూల తాతయ్య (శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం).

**మాతృదేవోభవ పురస్కారాలు:** చోడవరపు వెంకటలక్ష్మి, గంపా శ్రీదేవి, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి.

# టీడీపీలో సంస్థాగత రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ఆ ఇన్‌ఛార్జీలతోనే గొండు శంకర్ ఎన్నికల్లో పోటీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిని మార్చడంతో అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. శంకర్ ఎన్నిక కోసం ఎంతమంది పనిచేశారన్నది పక్కన పెడితే.. కొందరు ఇన్‌ఛార్జీలు ఓపెన్‌గానే శంకర్‌కు మద్దతు పలికి, ఆయన వెనుక తిరిగారు. ప్రస్తుతానికి రెండు వర్గాలకు చెందిన ఇన్‌ఛార్జీలు ఉన్నారు. గుండ లక్ష్మీదేవికి టిక్కెటివ్వనప్పుడు నిరసన తెలిపిన డివిజన్ ఇన్‌ఛార్జీలను మార్చబోమని అప్పట్లో ఎంపీ రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. అందులో భాగంగానే వారిని ఇప్పటికీ కొనసాగిస్తూ వస్తున్నారు. గొండు శంకర్‌కు మద్దతు పలికిన పది డివిజన్లలో ఇన్‌ఛార్జీల పోస్టులకు ఢోకా లేకపోయినా, ప్రస్తుతం ఎమ్మెల్యేతో సఖ్యంగా ఉంటున్నవారెవరు, ఇప్పటికీ అరసవల్లికి రాకపోకలు సాగిస్తున్న వారెవరు అన్న లెక్కల మేరకు ఐదు డివిజన్లలో ఇన్‌ఛార్జీలను మారుస్తారని, మిగిలినవి అలాగే ఉంటాయని తెలుస్తోంది. ఇక ఎన్నికల ముందు వైకాపాను వీడి తెలుగుదేశంలోకి వచ్చిన మాజీ మున్సిపల్ చైర్మన్ వరం కుటుంబానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండటంతో ఆ డివిజన్‌లో మార్పు అనివార్యమని తెలుస్తోంది. ఇక గొండు శంకర్ కోసం బలంగా పని చేసిన మరో వలస నాయకుడు దాస్యం రాంబాబు (నాని)ను కూడా అకామిడేట్ చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇదే డివిజన్ నుంచి రోణంకి కల్యాణ్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చి రెండు డివిజన్లు సర్దుతారని భోగట్టా.

**30న అధ్యక్షుడి ఎన్నిక**

50 డివిజన్లకు ఇన్‌ఛార్జీల నియామక ప్రక్రియను ఈ నెల 30 నాటికి పూర్తి చేసి అదే రోజు నగర టీడీపీ అధ్యక్షుడ్ని ఎన్నుకోవడానికి సిద్ధమవుతున్నారు. డివిజన్ల వరకు ఇన్‌ఛార్జీలను నియమించడం పెద్ద కష్టం కాకపోయినా, నగర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక మాత్రం ఎమ్మెల్యేకు కత్తిమీద సామే. ప్రస్తుత టౌన్ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తనను కొనసాగిస్తారన్న భావనతో ఉండగా, ప్రస్తుతం ఉన్న డివిజన్ ఇన్‌ఛార్జీలు, 30వ తేదీలోపు మారే ఇన్‌ఛార్జీల్లో మెజార్టీ సభ్యులు ఆయన మనుషులే. కానీ సుదీర్ఘ కాలంగా ఆయనే నగర అధ్యక్షుడిగా ఉన్నందున ఎమ్మెల్యే మారినట్టే నగర అధ్యక్షుడిని కూడా మార్చాలని మరికొందరు కోరుతున్నారు. ఇందులో బహిరంగంగా తనకు నగర పార్టీ పగ్గాలు కావాలని అడుగుతున్నది మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ ఒక్కరే. లక్ష్మీదేవి కుటుంబాన్ని మొదటే వ్యతిరేకించి గొండు శంకర్‌కు టికెట్ వస్తుందో, రాదో తెలియని రోజుల నుంచి ఆయన వెంట నడిచిన పాండ్రంకి శంకర్ నగర అధ్యక్ష పదవి కోసం పట్టుపడుతున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే ఆశీస్సులు తనకు ఉన్నాయని చెబుతున్నారు. వీరిద్దరూ కాకుండా కళింగకోమట్ల కోటా నుంచి వరం కుమారుడు సంతోష్, కోరాడ హరిగోపాల్ కూడా తమకిస్తే తప్పేంటన్న ధోరణిలో ఉన్నారు. అయితే ఇందులో వరం తనయుడు బహిరంగంగా తనకు కావాలి అని అడగకపోయినా కోరాడ హరిగోపాల్ మాత్రం నగరంలో కోమట్ల ఓట్లు పోలరైజ్ కావాలంటే నగర పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు భోగట్టా.

# అపార్ట్‌మెంట్లే భావి ఆశాసౌధాలు

మొదటిపేజీ తరువాయి

పేరొందిన శ్రీకాకుళం అపార్ట్‌మెంట్ కాన్సెప్ట్‌కు పూర్తి అనుకూలమైన ప్రాంతం. ఇక్కడ గాలిలో తేమ శాతం ఎక్కువ. నీరు, వాయు, శబ్ద కాలుష్యాలు ఉండవు. మౌలిక సదుపాయాలు, వసతులు పుష్కలంగా ఉన్నాయి. అన్ని వర్గాల ప్రజలకు నివాసయోగ్యమైన ప్రాంతం. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వలసలు పెరిగి స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ఇదే ప్రధానం. నగరానికి వస్తున్నవారంతా అపార్ట్‌మెంట్ కాన్సెప్ట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ విధానాలు, నిర్ణయాల వల్ల ప్రస్తుతం నిర్మాణ రంగం అంత సానుకూలంగా లేదు.

**సత్యం: నిర్మాణ రంగంపై ధరల పెరుగుదల ప్రభావం ఉంటుందా?**

**చక్రవర్తి:** నిర్మాణ రంగంపై సుమారు 200 రంగాలు ఆధారపడి ఉన్నాయి. అందువల్ల నిర్మాణ రంగం ఊపందుకుంటే ఈ రంగాల వారందరికీ ఉపాధి లభిస్తుంది. అయితే ధరల పెరుగుదల భవన నిర్మాణాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన ప్రతిసారీ ప్రభుత్వ పెద్దలను కలిసి నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తున్నాం. శ్రీకాకుళం నగరపాలక సంస్థకు నిర్మాణ రంగమే ప్రధాన ఆదాయవనరుగా ఉంది. ప్రతి ఏటా సుమారు రూ.25 కోట్ల ఆదాయం లభిస్తోంది. బిల్డింగ్ పర్మిట్ ఫీజు, హౌస్ ట్యాక్స్, డెవలప్‌మెంట్ ఛార్జీలు, లేబర్ సెస్‌తో పాటు ఇతర పలు రూపాల్లో ఈ ఆదాయం వస్తోంది. ఇక గృహాల క్రయవిక్రయాల ద్వారా ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్, జీఎస్టీ రూపంలో ఆదాయం సమకూరుతోంది. మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయి.

**సత్యం: సామాన్యుల సొంతింటి కల నెరవేరే అవకాశం ఉందా?**

**చక్రవర్తి:** ప్రతి ఒక్కరికీ సొంతింటి కల ఉంటుంది. ఒక వ్యక్తి అవకాశానికి మించి ప్లాట్లు కొనుగోలు చేయడం వల్ల సొంతింటి కల నెరవేరడం లేదు. ప్రస్తుతం భూమి ధరలు, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల అపార్ట్‌మెంట్ ద్వారానే సొంతింటి కల సాకారం అవుతుంది. అపార్ట్‌మెంట్ కల్చర్ వల్ల వాటిలో నివసించే కుటుంబాలకు రక్షణ ఉంటుంది. మానవ సంబంధాలు మెరుగుపడతాయి. అపార్ట్‌మెంట్ కల్చర్‌లో అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయి. బ్యూటిఫికేషన్‌లో భాగంగా పార్కులు అభివృద్ధి చెందుతాయి. పార్కింగ్ సమస్య పరిష్కారం అవుతుంది.

**సత్యం: శ్రీకాకుళానికి అపార్ట్‌మెంట్ కల్చర్ సూట్ అవుతుందా?**

**చక్రవర్తి:** రాష్ట్రంలో మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే శ్రీకాకుళంలో విభిన్నమైన వాతావరణం ఉంది. కట్టుకున్న ఇల్లు, కొనుగోలు చేసే ఫ్లాట్ సంప్రదాయ బద్ధంగా ఉండాలన్న ఆలోచనతో ఉంటారు. మిగతా ప్రాంతాల్లో బిల్డర్ తనకు అనుకూలంగా నిర్మిస్తే.. వాటిని కొనుగోలు చేసినవారు తమ ఆలోచన, అభిరుచి మేరకు కొన్ని మార్పులు చేస్తుంటారు. జిల్లాలో అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో సంప్రదాయానికి పెద్దపీట వేస్తారు. కొనుగోలుదారుల అభిరుచి మేరకు ఫ్లాట్లు ఉంటాయి. ఇంటీరియర్ డిజైన్ చేసే స్కిల్డ్ వర్కర్లు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ నుంచే ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటీరియర్ డిజైన్ పనులు చేస్తుంటారు. ఫ్లాట్ ధరలో దాదాపు 50 శాతం ఇంటీరియర్ డిజైనింగ్‌కే వెచ్చించాల్సి ఉంటుంది. అందువల్ల మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే జిల్లాలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లే తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయి.

**సత్యం: ప్రభుత్వం నుంచి మీ సంస్థ ఏం ఆశిస్తోంది?**

**చక్రవర్తి:** ప్రభుత్వం ద్వారా ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ అనుమతులు త్వరితగతిన మంజూరుచేయాలి. నిబంధనలు సులభతరం చేయాలి. నిర్మాణ సామగ్రి ధరలను అదుపులో ఉంచాలి. సిమెంట్‌పై విధిస్తున్న జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి. బిల్డింగ్ కాంపోనెంట్స్‌పై 18 శాతం జీఎస్టీ శ్లాబును ఎత్తేయాలి. ఎంబిజీ జీఎస్టీ 5 నుంచి 12 శాతం ఉంది. దీన్ని ఒక్క శాతానికి తగ్గించాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి పెంచిన 200 శాతం ధరలను తగ్గించాలి. నాలుగు శాతానికి పెంచిన డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చార్జీలను తిరిగి ఒక శాతానికే తగ్గించాలి. కన్‌స్ట్రక్షన్ అగ్రిమెంట్ ఛార్జీలను కూడా ఒక్క శాతానికి తగ్గించాలి. 7.5 శాతానికి పెంచిన అపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ఛార్జీలను తిరిగి ఒక శాతానికి తగ్గించాలి. ఇలా అన్నింటిపైనా పన్నులు పెంచడం ఫ్లాట్ల కొనుగోలుదారులకు భారంగా మారింది. ప్రభుత్వం పునరాలోచించి తగిన నిర్ణయాలు తీసుకుంటే నిర్మాణ రంగం వృద్ధి చెందడమే కాకుండా ప్రజల సొంతింటి కల నెరవేరేందుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. తక్కువ ధరలకే ఫ్లాట్లు అందుబాటులోకి వస్తాయి. నిర్మాణరంగంపై ఆధారపడిన వారికి ఉపాధి లభించడంతో పాటు ప్రభుత్వ అదాయం పెరుగుతుంది.

**సత్యం: క్రెడాయ్ ద్వారా ఇతరత్రా చేపడుతున్న కార్యక్రమాలేమిటి?**

**చక్రవర్తి:** క్రెడాయ్ తరఫున ప్రతి ఏటా సీఎస్ఆర్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నాం. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు ఉపయోగించేలా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాతా హీ సేవ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు భాగస్వాములు అవుతున్నారు. ప్రతి ఏటా రథసప్తమి రోజు ఆదిత్యుని దర్శనానికి అరసవల్లికి వచ్చే లక్షలాది భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తున్నాం. నగరపాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌పై అధికారుల సమక్షంలో క్రెడాయ్ అధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించాం. మాస్టర్ ప్లాన్‌ను కరపత్రాలుగా ప్రింట్ చేయించి నగర ప్రజలకు అందుబాటులో ఉంచి వారి అభిప్రాయాలు సేకరించారు. అలా వచ్చిన సుమారు 400 అభ్యంతరాలను నగర పాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి క్రెడాయ్ కృషి చేసింది.

**సత్యం: నగరంలో హోం ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నారు కదా.. దాని ముఖ్య ఉద్దేశం ఏమిటి?**

**చక్రవర్తి:** నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రతి ఏటా హోం ఎక్స్‌పో నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు ఈ ఎక్స్‌పో జరుగుతుంది. బిల్డర్స్ అందరినీ ఒకే వేదికపైకి తీసుకు రావడానికి ఎక్స్‌పో ఉపయోగపడుతుంది. ఇందులో బిల్డింగ్ కాంపోనెంట్స్ ప్రదర్శన ఉంటుంది. మధ్యవర్తిత్వం లేకుండా కొనుగోలుదారులు నేరుగా తమకు నచ్చిన ఫ్లాట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. అలాగే బ్యాంకుల ద్వారా అక్కడికక్కడే రుణాలు పొందే అవకాశం ఎక్స్‌పోలో కల్పిస్తున్నాం. దీనివల్ల కొనుగోలుదారుడికి సమయం, శ్రమ కలిసివచ్చి ఆర్థికంగా కొంత వెసులు బాటు కలుగుతుంది. ఎక్స్‌పోలో ప్రవేశం ఉచితం. సందర్శకులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు కూడా అందజేస్తాం.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.